

క్రీడాకారులను ప్రోత్సహించాలి

యువత గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు ముందుకు సాగాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. 8లో▸

ఓయూ డిగ్రీ పరీక్షలు 17కు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఈ నెల 11 నుంచి జరగాల్సిన వివిధ డిగ్రీ రెగ్యులర్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ రెగ్యులర్ (సీబీసీఎస్) మొదటి సెమిస్టర్ పరీక్షలను ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి వరకు జరిగే సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరగనున్నాయి.

8న నీళ్లు బంద్

సాక్షి, సిటీబ్యూరో: కోకాపేటలోని మై హోమ్ అవతార్ వద్ద ఏర్పడిన పైపులైన్ లీకేజీ మరమ్మతులు చేపడుతున్నారు. ఈ కారణంగా ఈ నెల 8న బుధవారం ఉ. 6 గంటల నుంచి గురువారం, ఉ.6 గంటల వరకు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు, షేక్‌పేట్, టోలీచౌకి, గోల్కొండ, చింతల్ బస్తీ, విజయనగర్, ఓల్డ్ మల్లేపల్లి, గండిపేట్, కోకాపేట్, నార్సింగి, మణికొండ, ఖానాపూర్, నెక్నంపూర్, మంచిరేవుల తదితర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోనుంది.

న్యూస్‌రీల్

ఆ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించండి



ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

హుడాకాంప్లెక్స్: వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆ సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డా.బి.రాఘవరెడ్డి, పి.కృష్ణమూర్తిగౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లోనే వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో ఉద్యోగులకు జరిగే పదోన్నతుల్లోనే వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్లుగా పదోన్నతి కల్పిస్తామని కవిత హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి దినేష్‌గౌడ్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు కిషోర్‌కుమార్, రామారావు, పూర్ణ, జనార్దన్, అనిల్, వెంకటనారాయణ, బాలసుబ్రహ్మణ్యం ,గోపాల్‌రావు, ఈశ్వర్ పాల్గొన్నారు.


సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



గిరిజనుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీ నాయకులు

కద్తాల్: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతిని (ఫిబ్రవరి 15) అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ డిమాండ్ చేశారు. గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిరాహార దీక్ష చేపట్టారు. వివిధ పార్టీల నాయకులు మాన్యానాయక్, రెడ్యానాయక్, నరేశ్‌నాయక్, జయపాల్‌నాయక్, రాందాస్, సీతారాం, శ్రీను రాథోడ్, తులసీరాం, లాల్‌నాయక్, రమేశ్ తదితరులు దీక్షలో కూర్చున్నారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాట నర్సింహ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భగీరథ్, నాయకులు సిద్దిగారిదాస్, లాయక్‌అలీ తదితరులు సంఘీభావం తెలిపారు. గిరిజనుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అజయ్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్

కొత్తూరు: విద్యార్థులు, యువత తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని చౌక్ బాల్ క్రీడా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌నాయక్ ఆకాంక్షించారు. కొత్తూరు పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన చౌక్‌బాల్ జాతీయస్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ కె.శ్రీనివాస్‌గౌడ్ పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పాండిచ్చేరి, కేరళ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో నైపుణ్యం పెంచుకొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో పోలీసు, ఆర్మీతో పాటు పలు రంగాల్లో సులువుగా ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సోమశేఖర్, సుధాకర్, మధు, హరిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

కీసర బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

కీసర: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ వెంకన్న తెలిపారు.

జంప్ కాకుండా క్యాంపు



- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అవిశ్వాస గుబులు
- తీర్మానానికి కౌన్సిలర్ల పట్టు
- చేజారకుండా జాగ్రత్త పడుతున్న చైర్మన్, వైస్ చైర్మన్లు
- అసంతృప్త నేతలకు బుజ్జగింపులు
- ఎక్కడికక్కడ క్యాంపులకు తరలింపు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీల్లో అవిశ్వాసం కోసం పట్టుబడుతుండగా, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ సహా తుర్కయంజాల్ మున్సిపాలిటీ సభ్యులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అసంతృప్తులను బుజ్జగించేందుకు మేయర్లు, చైర్‌పర్సన్లు యత్నిస్తున్నా.. మెజార్టీ సభ్యులు ససేమిరా అంటున్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాల్సిందేనంటూ పట్టుబడుతున్నారు. అయితే అవిశ్వాస తీర్మానం గడువును మూడేళ్ల నుంచి నాలుగేళ్లకు పెంచుతూ గత అసెంబ్లీలో ఆమోదించి, పంపిన బిల్లు ఇప్పటికీ గవర్నర్ వద్దే పెండింగ్‌లో ఉండటం.. ఈ అంశంపై ప్రభుత్వం కూడా స్పష్టత ఇవ్వకపోవడంతో గందరగోళం నెలకొంది. సభ్యులు ఇచ్చిన నోటీసులు కలెక్టర్ వద్దే పెండింగ్‌లో ఉండటంతో వెంట ఉన్న సభ్యులు చేజారిపోకుండా మేయర్లు, చైర్‌పర్సన్లు జాగ్రత్తపడుతున్నారు. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ సభ్యులు రెండు బృందాలుగా విడిపోయి క్యాంపునకు వెళ్లారు. మిగిలిన మున్సిపాలిటీల్లోనూ ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

క్యాంపులో పెద్ద అంబర్‌పేట్ సభ్యులు

పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో అధికార బీఆర్ఎస్‌కు చైర్‌పర్సన్ సహా మరో ఏడుగురు సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు 13 మంది, బీజేపీ, సీపీఐ నుంచి ఒక్కో సభ్యుడి చొప్పున, మరొకరు ఇండిపెండెంట్ సభ్యుడు సహా మొత్తం 24 మంది ఉన్నారు. చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌పై 15 మంది సభ్యులు తిరుగుబావుటా ఎగరేశారు. అవిశ్వాస పరీక్ష నిర్వహించాలని కోరుతూ కలెక్టర్, కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. అవిశ్వాసం పెట్టే అంశంపై కలెక్టర్ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ సహా మరో ఐదుగురు ఒక బృందంగా, మిగిలిన 15 మంది మరో బృందంగా క్యాంపునకు తరలివెళ్లారు. చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్ బృందం ప్రస్తుతం గోవాలో ఉండగా, మిగిలిన 15 మంది సభ్యులు ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. తటస్థంగా ఉన్న మరో ఇద్దరు స్థానికంగానే ఉన్నారు. పాలక మండలి అధికార పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ఆయా నేతలు నువ్వా నేనా అన్నట్లు పోటీపడుతుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పాలకులంతా వారం రోజుల నుంచి అజ్ఞాతంలో గడుపుతుండటంతో పాలన గాడి తప్పింది.

ఆచితూచి వ్యవహరిస్తున్న బండ్లగూడ కార్పొరేటర్లు..

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ సహా 22 మంది కార్పొరేటర్లు ఉన్నారు. బీఆర్ఎస్‌కు 14, కాంగ్రెస్‌కు 5, బీజేపీ రెండు, ఎంఐఎంకు ఒకరు చొప్పున కార్పొరేటర్లు ఉన్నారు. అధికారపార్టీకి చెందిన మెజార్టీ సభ్యులు మేయర్‌పై అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల మొయినాబాద్ వేదికగా అవిశ్వాసం పెట్టే అంశాన్ని చర్చించారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సభ్యులకు సర్ది చెప్పడంతో తాత్కాలికంగా వెనక్కి తగ్గినప్పటికీ.. అసంతృప్త జ్వాలలు మాత్రం తగ్గలేదు. మేయర్ పాల్గొనే కార్యక్రమాలకు డిప్యూటీ మేయర్‌తో పాటు మరికొంత సభ్యులు దూరంగా ఉంటున్నారు. అవిశ్వాసం కోసం ఆచితూచి వ్యవహరిస్తున్నారు. కార్పొరేషన్‌లో ఎప్పుడు ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకోనున్నాయనే అంశంపై ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

బుజ్జగింపులకు లొంగని ఆదిబట్ల సభ్యులు

ఆదిబట్ల మున్సిపాలిటీలో అధికార బీఆర్ఎస్‌కు ఏడుగురు, కాంగ్రెస్‌కు ఏడుగురు, బీజేపీకి ఒకరు చొప్పున సభ్యులు ఉన్నారు. మొత్తం 15 మందిలో 13 మంది చైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే అవిశ్వాసం కోసం నోటీసులు ఇచ్చారు. ప్రస్తుతం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతుండటం, ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో కొంత అయోమయం నెలకొంది. కలెక్టర్ నిర్ణయం పైనే మున్సిపాలిటీ పాలక మండలి భవితవ్యం ఆధారపడి ఉంది. అధికారపీఠాన్ని నిలబెట్టుకునేందుకు చైర్‌పర్సన్ వర్గీయులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. అసమ్మతులను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు.

పట్టు వీడని పట్నం కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 24 మంది సభ్యులు ఉండగా, వీరిలో బీఆర్ఎస్‌కు 16 మంది, కాంగ్రెస్‌కు ఆరుగురు, బీజేపీకి ఇద్దరు చొప్పున సభ్యులు ఉన్నారు. చైర్‌పర్సన్ స్రవంతిపై అవిశ్వాసాన్ని కోరుతూ 21 మంది సభ్యులు సంతకాలు చేశారు. సభ్యులను బుజ్జగించేందుకు చైర్‌పర్సన్ యత్నిస్తున్నా.. వారిలో ఏ ఒక్కరూ వెనక్కి తగ్గడం లేదు. మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ ఒంటరయ్యారు. అవిశ్వాస నోటీసులు ఇచ్చిన తర్వాత రెండు అంశాలపై సమీక్ష నిర్వహించగా, ఒక కో ఆప్షన్ సభ్యురాలు మినహా ఏ ఒక్క కౌన్సిలర్ హాజరు కాలేదు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాల్సిందేనంటూ పట్టుబడుతున్నారు.



రైతులకు ఇళ్ల సర్టిఫికెట్లు అందిస్తున్న మంత్రి, జెడ్పీచైర్‌పర్సన్ తదితరులు

భూములు త్యాగం చేసిన రైతులకు అండగా ఉంటాం

మంత్రి సబితారెడ్డి

కందుకూరు: ఫార్మాసిటీకి భూములు త్యాగం చేసిన రైతులకు అభివృద్ధి చేసిన లే-అవుట్‌లో సీఎం కేసీఆర్ ప్లాట్లను బహుమతిగా అందిస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కొనియాడారు. మండల పరిధిలో ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో చేపట్టిన లే-అవుట్‌లో శనివారం అన్నోజిగూడ, ఆకులమైలారం, బేగరికంచె, మీర్‌ఖాన్‌పేట గ్రామాలకు చెందిన 342 మంది రైతులకు ప్లాట్ల సర్టిఫికెట్లను జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎకరాకు తాను వంద గజాలు అడిగితే సీఎం 121 గజాల చొప్పున అందిస్తున్నారని, ఆయన ఇస్తున్న కానుకను అమ్ముకోవద్దని, పిల్లల భవిష్యత్ కోసం ఉంచుకోవాలని సూచించారు. ఉగాది వరకు ప్లాట్లను కేటాయిస్తామన్నారు. ఐదేళ్లలో ఈ ప్రాంతం కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి చెందుతుందన్నారు.ఇక్కడ ఏర్పాటయ్యే కంపెనీల్లో శిక్షణ ఇచ్చి స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఫార్మాకు భూములు ఇచ్చిన గ్రామాల్లో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ.. ఫార్మాసిటీ అంటే అభివృద్ధి అని, తెలంగాణలో ఎక్కడా లేనివిధంగా పెద్ద ఎత్తున ఈ ప్రాంతంలో కంపెనీల స్థాపన జరగనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, సర్పంచులు కాకి ఇందిర, గొరిగె కలమ్మ, సరళమ్మ జ్యోతి, మంద సాయిలు, ఎంపీటీసీలు కాకి రాములు, అచ్చన పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షు డు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిర,నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు చిర్ర సాయిలు, లచ్చానాయక్, డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, ఆనంద్, దేవీలాల్, సీనియర్ నాయకులు కాకి దశరథ, మేఘనాథ్‌రెడ్డి, దేవేందర్, సామయ్య, సదానంద్‌గౌడ్, కాకి రవి, పాండుగౌడ్, గండు నర్సింహ, జి.యాదయ్య, జంగయ్య, మహేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, స్వరూప పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్ రెడ్డి



కుంట్లూర్‌లో పేదలను ఉద్దేశించి మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి ఇళ్లులేని నిరుపేదలందరికీ 125 గజాల ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు పక్కా ఇంటి నిర్మాణానికి రాబోయే బడ్జెట్ సమావేశంలో రూ.ఐదు లక్షలు కేటాయించాలని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కుంట్లూర్‌లో చేస్తున్న భూ పోరాట క్షేత్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. పొట్ట చేత పట్టుకొని వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన పేదవారు ఇంటి కిరాయి కట్టేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆర్థికంగా ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుంట్లూర్‌లోని సర్వేనంబర్ 215 నుంచి 224 వరకు భూదాన భూమిలో గుడిసెలు వేసుకొని నేటికీ 14 రోజులు కావస్తోందని ఇక్కడి ప్రజలకు సరైన మౌలిక వసతులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మండల కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ, జిల్లా కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు, స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చందు నాయక్, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్‌నాయక్, ప్రజానాట్యమండలి కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్, ఆటో ఢీ

- ఒకరి దుర్మరణం
- మరో పదిమందికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



బోల్తా పడిన ఆటో

తలకొండపల్లి: టిప్పర్, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన 13 మంది కూలీలు ఇదే మండలంలోని అంతారంలో కూలి పని చేసేందుకు శనివారం ఉదయం ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో చంద్రధనలోని సాయిరెడ్డి కుంట సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ వీరి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న బైర్లపాక సంతోష (40) అక్కడికక్కడే మృతి చెందింది. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కుమ్మరి శ్యామలమ్మ, వడ్డె అలివేలు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నష్ట పరిహారం చెల్లించాలని మృతురాలి, గాయపడిన వారి బంధువులు చంద్రధనలోని సాయికుంట వద్ద రోడ్డుపై బైఠాయించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. సంతోష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. టిప్పర్ అతి వేగంగా దూసుకురావడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

గ్రూప్స్ కోసం ఉచిత శిక్షణ

సాక్షి రంగారెడ్డి జిల్లా: ఎస్సీ స్టడీసర్కిల్‌లో గ్రూప్స్–2, 3, 4, తదితర పోటీ పరీక్షలకు మూడు నెలలపాటు (నాన్ రెసిడెన్షియల్) ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు www. tsstucdycircle. co. in వెబ్‌సైట్‌లో సంప్రదించాలి. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 4, 5 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఎస్సీస్టడీ సర్కిల్ కేంద్రంలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జరుగుతుంది. వివరాలకు. 93903 51016, 84668 52217 నంబర్లను సంప్రదించాలి.

PUBLIC NOTICE

The general public here by informed that my Client Mr. SESHA REDDY REDDIGARI, S/o. R. RAMA SUBBA REDDY, aged about 70 years, Occupation: Private Employee, Presently Residing at # 8267, HAMPTON CIR EAST, INDIANAPOLIS, Indiana, 46256-USA, Passport No 564375604, U.S.A. Represented by his G.P.A. Holder Smt. RAVULA RADHIKA REDDY, W/o. RAVULA SAHADEV REDDY, aged about: 68 years, Occupation: House Wife, R/o. Presently Residing at: C/o. Solventek Pvt. Ltd., Plot No 78A, Unit 301, Shilpa Layout, Phase-II. Gachibowli, Ranga Reddy District, Telangana State-500032, the Principal owner already Purchased Open Land bearing Plot No. 239 (Western Part), admeasuring 400 Sq. Yards or 334.4 Sq. Mtrs., In Survey No. 51/అ, Situated at PIGLIPUR REVENUE VILLAGE, Abdullapurmet Rev. Mandal, Formerly Under Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, Bounded by North - 40' Wide Road, South - Plot No 240, East - Plot No. 239 (Eastern Part), West - 40' Wide Road, Vide Regd. Sale Deed Doct. No.2077/2007, Book-I, dated 03-February-2007, Regd. at S.R.O. Pedda Amberpet, Ranga Reddy District, of valuable sale consideration amount.

And the Original Sale Deed Doct. No 2077/2007, Book-I, dated 03-February-2007, Regd. at S.R.O. Pedda Amberpet, Ranga Reddy District, was misplaced by my Client (G.P.A. Holder: Smt. RAVULA RADHIKA REDDY), by traveling by Yellow Taxi From Present Residence Gachibowli to Abdullapurmet, on dated: 10/06/2022, at 11.30 AM, if anybody is having objection with regard to the above said Schedule property then they shall contact the undersigned with relevant documents within (7) seven days of this Publication, otherwise the parties will proceed for the registration. Thereafter no objection will be entertained.

Sd/- P. JANARDHAN, Advocate.
Off.H.No.5-4-1689/1/N/2,
Shope No. 9 & 10, S.R.O Building,
Vanasthalipuram, Rangareddy District (T.S).
Mobile No: 9391023823.

సమాధుల కూల్చివేత



ధ్వంసమైన సమాధులు

కడ్తాల్: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 799, 813లో గుర్తుతెలియని దుండగులు శుక్రవారం రాత్రి తమ కుటుంబ సభ్యులకు చెందిన సమాధులను ధ్వంసం చేశారని బాధిత కుటుంబీకులు తెలిపారు. దుండగులను గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని కందికంటి సుధాకర్‌గౌడ్, కందికంటి యాదయ్యగౌడ్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.

బీఎంఎస్ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

శంషాబాద్: రవాణా రంగంలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ మజ్దూర్‌సంఘ్ ఈ నెల 14న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు బీఎంఎస్ ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. రవాణా రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సమీక్షించాలన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- యువత గొప్ప లక్ష్యాలను ఎంచుకోవాలి
- ఆ దిశగా నిరంతరం కృషి చేయాలి
- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: యువత గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు ముందుకు సాగాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో నెలరోజులుగా జరుగుతున్న పైండ్ల గోపాల్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ విజేత ఆలూరు జట్టుకు రూ.60వేల నగదు, షీల్డ్.. రన్నరప్ ఇబ్రహీంపల్లి జట్టుకు రూ.30వేల నగదు, షీల్డ్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పోటీల్లో గెలుపు, ఓటములు సహజమని.. ఓటమి గెలుపునకు నాందిగా తీసుకోవాలని సూచించారు. ఉత్తమ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ప్రదర్శించిన క్రీడాకారులకు సైతం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, పీఏసీఎస్ చైర్మన్‌లు డి. వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరంజన్‌రెడ్డి, ఆగిరెడ్డి, సమత, మధుసూదన్‌గుప్తా, శ్రీనివాస్, శ్రీకాంత్, మల్లారెడ్డి, నాగిరెడ్డి, మల్లేశ్, చంద్రశేఖర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

ముడిమ్యాల అటవీ ప్రాంతంలో అస్థిపంజరం



ముడిమ్యాల అటవీ ప్రాంతంలో లభించిన గుర్తు తెలియని వ్యక్తి ఎముకలు

చేవెళ్ల: మండలంలోని ముడిమ్యాల అటవీప్రాంతంలో ఓ వ్యక్తి అస్థిపంజరం లభించింది. చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. అటవీ ప్రాంతంలో పశువుల కాపర్లకు మనిషి అస్థిపంజరం, బట్టలు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ప్రదీప్‌కుమార్‌లు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎముకలను, బట్టలను సేకరించారు. మూడు నెలల క్రితం ముడిమ్యాలకు చెందిన మన్మంతుల జంగయ్య(70) అదృశ్యం కావడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అస్థిపంజరం అతనిదే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎములకను డీఎన్ఏ పరీక్షకోసం పంపనున్నట్లు పోలీసులు తెలిపారు. పరీక్షల అనంతరం వచ్చిన నివేదికతో ఎవరనేది తెలుతుందని చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ నీరజ



మాట్లాడుతున్న నీరజ

యాచారం: ఉపాధి పనులు వేగవంతం చేసేలా చూడాలని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ నీరజ అన్నారు. శనివారం మండల కేంద్రంలో యాచారం, మంచాల, మాడ్గుల, ఇబ్రహీంపట్నం మండలాల ఈజీఎస్ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రారంభంలోనే ప్రతీ గ్రామం నుంచి వంద మంది కూలీలకు తగ్గకుండా పనులకు వచ్చేలా చూడాలని సూచించారు. పనులు చేసే కూలీలకు ప్రతీ వారం వేతనాలు అందేలా రికార్డులు నమోదు చేయాలన్నారు. మార్చిలో పూర్తి స్థాయిలో కూలీలు పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి చట్టంలో నింబంధనల ప్రకారం పనులు చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఏపీడీ సక్రియనాయక్, వివిధ మండలాల ఏపీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.